## ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

**గజ్వేల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులస్వామి దివ్య ఆశీస్సులతో ఆదివారం గజ్వేల్‌మండలం దాతర్‌పల్లి, కోనాపూర్ గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక భువనగిరి కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత, వంద అనుబంధ గ్రంథాలను పరిచయ కార్యక్రమాన్ని పౌర్ణమి సందర్భంగా నిర్వహించారు. సంపూర్ణజ్ఞానానికి గుర్తుగా పౌర్ణమి తిథి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఇందూ జ్ఞానవేదిక సభ్యులు మాట్లాడుతూ ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుడు యుద్ధరంగంలో మొట్టమొదటి రోజున అర్జుననికి భగవద్గీత జ్ఞానాన్ని తెలిపారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏ మతం లేని కాలంలో భగవద్గీత జ్ఞానం తెలియజేయబడిందన్నారు. ప్రపంచంలోని ప్రతి మానవునికి మొట్టమొదటి ప్రథమ దైవగ్రంథం భగవద్గీత అన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ భగవద్గీత గురించి వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక భువనగిరి కమిటీ సభ్యులు దేవేందర్, లింగస్వామి, శంకర్, భాస్కర్, ధనలక్ష్మి, రాజేశ్వరి, సుధీర్, సామ్రాట్, పార్థివ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## బిసి-ఎలో 57 కులాల హక్కులను కాపాడాలి

**ముదిరాజ్‌ల చేరిక నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: కొండూరు సతీష్‌కుమార్**

**ధూళిమిట్ట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

బిసి-ఎ జాబితాలో ముదిరాజ్‌లను చేర్చే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నాయి బ్రాహ్మణ సేవాసంఘం ధూళిమిట్ట మండల అధ్యక్షులు కొండూరు సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే బిసి-ఎలో ఉన్న 57 కులాలు సామాజికంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్నాయని కొత్త కులాల చేరికతో విద్య, ఉద్యోగ రిజర్వేషన్ ప్రయోజనాలు తగ్గే ప్రమాదం ఉందని కొండూరు సతీష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వర్గానికి ప్రయోజనం కల్పించే క్రమంలో, మరో వర్గానికి అన్యాయం చేయొద్దని ఇప్పటికే ఉన్న కులాల హక్కులను కాపాడాలని కొండూరు సతీష్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

## భారతదేశం గొప్ప సంస్కృతీసంప్రదాయాలకు నిలయం

**-మన పండుగలు విశ్వవ్యాప్తమయ్యాయి: ఎంపి రఘునందన్‌రావు**





అలయ్ బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

భారతదేశం గొప్ప సంస్కృతీసంప్రదాయాలకు నిలయమైన దేశం అని, ఏదేశం వెళ్లినా, హిందువుల పండుగలను గొప్పగా జరుపుతున్నారని మనపండుగలు విశ్వవ్యాప్తమయ్యాయని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యదర్శి దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అందరినీ ఒక చోట చేర్చాలనే ఉద్దేశ్యంతో 25యేళ్ల క్రితం మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ ప్రారంభించిన అలయ్ బలయ్ కార్యక్రమం సిద్దిపేటలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అందరూ ఒకదగ్గర కలవాలన్న ఉద్దేశ్యంతో దూది శ్రీకాంత్‌రెడ్డి గత 7,8యేళ్లుగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఇదేస్ఫూర్తిని కొనసాగించాలన్నారు. అమెరికాలో అయప్ప భక్తుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని, అక్కడ సైతం అయ్యప్ప దేవాలయాలను నిర్మిస్తున్నారని తెలిపారు. బతుకమ్మ, దసరా, వినాయకచవితి వంటి వేడుకలను ప్రపంచంలోని ముస్లిం అరబ్‌దేశాలలో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్, అంబటి బాలేష్‌గౌడ్, తుంగ కనకయ్య, జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, కొర్తివాడ రామన్న, మాజీ కౌన్సిలర్ బాసంగారి వెంకట్, రాధవేణు తదితరులు పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల సేవలకు సముచిత స్థానం దక్కేనా..!

**-టేక్మాల్ మండల కాంగ్రెస్‌లో జోరుగా చర్చ**

**టేక్మాల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

మూడు దశాబ్దాలకు పైగా పార్టీజెండాను మోస్తూ కరుడుగట్టిన కాంగ్రెస్‌వాదిగా తన ప్రత్యేకతను టేక్మాల్ గ్రామానికి చెందిన నిమ్మ రమేష్ చాటుకుంటున్నారు. ఊహ తెలిసినప్పటి నుండి నేటి వరకు ఏనాడూ పార్టీ మారకుండా, విలువలకే పెద్దపీట వేస్తూ ఆయన ప్రయాణం సాగుతోంది. యుక్తవయసులోనే కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులైన రమేష్ గత 35 ఏళ్లుగా పార్టీ సిద్ధాంతాల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. 35 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం చేసిన నిమ్మ రమేష్ జిల్లా స్థాయిలో సముచితస్థానం కల్పించాలని మండల కాంగ్రెస్ కమిటీ కోరుతోంది. కాంగ్రెస్ పార్టీలో మూడున్నర దశాబ్దాలుగా తిరుగులేని రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్న నిమ్మ రమేష్‌కు జిల్లా స్థాయిలో సముచితమైన పదవిని కేటాయించాలని మండల కాంగ్రెస్‌కమిటీ చర్చలుచేస్తుంది. అట్టడుగు స్థాయి నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న నాయకులకు తగిన గుర్తింపునివ్వాలని పార్టీశ్రేణులు ముక్తకంఠంతో కోరుతున్నారు. టేక్మాల్ జూనియర్ కళాశాల యన్‌యస్‌యుఐ అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థి రాజకీయాల ద్వారా నాయకత్వ లక్షణాలను చాటుకున్నారు. పార్టీకి ఆయన అందించిన సేవలను, చేసిన త్యాగాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతస్థాయి పదవి కట్టబెట్టాలని నాయకులు కోరుతున్నారు. మరోవైపు నూతనంగా సహకారసంఘం కమిటీ ఏర్పాటయితే గతంలో ఆ పదవిని విజయవంతంగా నిర్వహించిన ఆయనకే రెండవసారి అవకాశం ఇవ్వాలని పార్టీశ్రేణులు, నాయకులు అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీకోసం దశాబ్దాలుగా చెమటోడ్చిన నిజమైన కార్యకర్తలకు, నాయకులకు తగిన ఫలితం దక్కాలన్నదే టేక్మాల్ కాంగ్రెస్ శ్రేణుల మనోభావంగా ఉంది.

## అలయ్ బలయ్‌తో కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

**-రూ.మూడువేల కోట్లతో నియోజకవర్గంలో ప్రగతి పనులు**

**-అందోలుపై మంత్రి దామోదర రాజనరసింహ మార్క్**

**చౌటకూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**



మంత్రి దామోదర్ కలసి శుభాకాంక్షలు తెలిపిన జీఆర్ శ్రీనివాసరెడ్డి

విజయదశమని పండగ సందర్భంగా చౌటకూర్ మండలం సుల్తాన్పూర్ గ్రామశివారులోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం నిర్వహించిన ఆలయ్‌బలయ్ కార్యక్రమం కాంగ్రెస్‌పార్టీలో నూతనోత్తేజాన్నినింపింది. ఆత్మీయపలకరింపులు, నాయకులు, కార్యకర్తల కలయికతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమం పార్టీశ్రేణుల్లో జోష్‌ను మరింతగా పెంచినట్టయింది. ఆలయ్‌బలయ్‌కు అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని తొమ్మిదిమండలాలు, అందోలు జోగిపేట పట్టణంనుండి కాంగ్రెస్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, మండలాల పార్టీ అధ్యక్షులు, శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద ఎత్తున శ్రేణులు తరలిరావడంతో పంక్షన్‌హాలు కిక్కిరిసింది. అన్నిప్రాంతాల నుండి నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉన్నదనే సంకేతం ఇచ్చినట్లయింది. అద్యంతం అలయ్‌బలయ్ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగిన ఈవేడుక రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి దామోదర రాజనరసింహ కుడికంటికి శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ విశ్రాంతితీసుకోకుండా కార్యకర్తలను దసరాపండుగవేళ కలుసుకోవాలన్న ఉద్దేశంతో ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కార్యక్రమానికి హాజరుకావడంపట్ల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచినట్లయింది. అలయ్‌బలయ్ కార్యక్రమం కేవలం పండుగ వేడుకకే పరిమితం కాకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే అవకాశంగా నిలిచింది. మొత్తంగా అలయ్‌బలయ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపగా, పార్టీ ఐక్యతను చాటిందని చెప్పవచ్చు.

## 40 గజాల స్థలం కోసం తమ్ముడిని చంపిన అన్న

**-సోదరుల మధ్య రెండేళ్లుగా కొనసాగుతున్న వివాదం**

**కంది, అక్టోబరు 25, ప్రభాతవార్త:**



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

40 చదరపు గజాల ఖాళీ స్థలం కోసం తోడబుట్టిన తమ్ముడిని అన్న హతమార్చిన సంఘటన మండల పరిధిలోని మక్తలూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మక్తలూరు గ్రామానికి చెందిన కొత్తగాడి వెంకటేష్ (48), కొత్తగాడి శ్రీనివాస్ (36)లు అన్నదమ్ములు. గ్రామంలోని 40 చదరపు గజాల ఖాళీ స్థలం కోసం గత రెండేళ్లుగా సోదరుల మధ్య వివాదం కొనాసగుతోందన్నారు. శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కొత్తగాడి వెంకటేశ్ తన తమ్ముడు కొత్తగాడి శ్రీనివాస్‌పై కర్రలతో దాడిచేయగా శ్రీనివాస్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## వరదరాజస్వామి ఆలయంలో బిఆర్ఎస్ నాయకుల శ్రమదానం

**మర్కుక్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వర్ధరాజ్‌పూర్ గ్రామంలోగల వరదరాజస్వామి ఆలయ పరిసరాల్లో బిఆర్ఎస్ నాయకులు ఆదివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయపరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో నాయకులు, మహిళలు స్వచ్ఛందంగా శ్రమదానంచేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ప్రవీణ్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, నాయకులు రమేష్, బాలమణి, సాయి, హిమవంత్, విఘ్నేష్, అమరేందర్, రాములు, యాదగిరి, విక్కి పాల్గొన్నారు.

# దేశంలో 13కోట్ల ఓట్ల తొలగింపు

**-స్పందించని మాజీ సిఎం కెసిఆర్**
**-బిజెపి, బిఆర్ఎస్‌లు రెండూ ఒక్కటే**
**-ఎఐసిసి అధికార ప్రతినిధి శరల్‌పటేల్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎఐసిసి అధికార ప్రతినిధి శరల్‌పటేల్

**గజ్వేల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

ఓటు హక్కు కలిగి ఉండడం ప్రతి భారతీయుని హక్కు అని ఎఐసిసి అధికార ప్రతినిధి శరల్ పటేల్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎఐసిసి అధికార ప్రతినిధి శరల్ పటేల్ మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలనే ఉద్దేశంతో 1951లో కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తమ పార్టీకి అనుకూలమైన వారి ఓట్లను ఉంచి వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కులాలు, ప్రాంతాలు, మతాల పేరిట విభజించి పాలిస్తున్నట్లు బిజెపిపై ఘాటుగా విమర్శించారు. ఇందులో భాగంగానే నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం వద్ద రాహుల్‌గాంధీ ప్రాతినిథ్యంలో సుమారు 15లక్షల మందితో నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ మాట్లాడుతూ ఓట్ల చోరీ విషయంలో బిజెపి చేస్తున్న మోసాన్ని ఎండగట్టాలనే ఉద్దేశంతోనే రాహుల్‌గాంధీ సంవత్సర కాలం నుండి ఓటు చోరీ విషయంలో పోరాటం కొనసాగిస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 92లక్షల మందికి నోటీసులు ఇచ్చినా కూడా మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నోరు విప్పడంలేదని ఆయన విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని, రాష్ట్రాన్ని పక్కనబెట్టి గజ్వేల్ నియోజకవర్గంలో సైతం ఎస్ఐఆర్ విషయంలో ఏ ఒక్కనాడు సమీక్ష పెట్టలేదని అన్నారు. లక్షలాదిమంది ఓట్లు తొలగిస్తున్నప్పటికీ, గతంలో ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఎందుకు మాట్లాడడంలేదని, డబుల్ ఇంజన్ సర్కార్ అంటూనే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందాలతో కలిసి తెలంగాణలో పనిచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, స్థానిక కౌన్సిలర్ బాబురావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, విఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మొనగారి రాజు, గాడిపల్లి శ్రీనివాస్, జంగం వెంకట్‌గౌడ్, రిమ్మనగూడ సర్పంచ్ కరుణాకర్, ఆంజనేయులు, నక్క రేగొండగౌడ్, సురేష్, చెప్యాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య కోరల్లో చెరువులు..!

**-గుమ్మడిదల పారిశ్రామికవాడపై పర్యవేక్షణ ఎక్కడ..?**
**-పారిశ్రామిక వ్యర్థాలపై కఠినచర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు**

**సంగారెడ్డి, అక్టోబరు 22, ప్రభాతవార్త:**

పారిశ్రామిక అభివృద్ధి పేరుతో వెలువడుతున్న వ్యర్థాలు జల వనరులకు ముప్పుగా మారుతున్నాయన్న ఆందోళన గుమ్మడిదల పరిసర ప్రాంతాల్లో వ్యక్తమవుతోంది. గుమ్మడిదల బొంతపల్లి, దోమడుగు ప్రాంతాలనుంచి వెలువడే వ్యర్థాలు, మురుగునీటి ప్రవాహాలపై సమగ్ర పర్యవేక్షణ లేకపోతే పరిస్థితి మరింతతీవ్రంకావచ్చని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గుమ్మడిదల, అనంతారం, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం, ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ఇతర జలవనరులపై కాలుష్యప్రభావం పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక ప్రాంతంలో మొదలైన కాలుష్యప్రవాహం మరో ప్రాంతంలోని చెరువులోకి చేరి, అక్కడి నుంచి మరొక జలవనరుకు చేరే పరిస్థితి ఉంటే అది ఒక్క చెరువు సమస్యగా కాకుండా కాలుష్యగొలుసుగా మారే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

**చెరువులే కాలుష్యానికి బలిపశువులా..?**

ఏళ్ల తరబడి గ్రామాల సాగునీటి అవసరాలను తీర్చిన చెరువులు, కుంటలు ఇప్పుడు పారిశ్రామిక ప్రాంతాల చుట్టుపక్కల ఉండటంతో వాటి నీటి నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాలుష్య ప్రభావం నిజంగా ఉందా? ఉంటే ఏపరిశ్రమ లేదా ఏప్రవాహం కారణమవుతోంది? కాలుష్యకారక పదార్థాలు ఏస్థాయిలో ఉన్నాయి? అనే అంశాలపై శాస్త్రీయంగా నిర్ధారణచేయాల్సిన అవసరం ఉంది. కేవలం ఫిర్యాదు వచ్చినప్పుడు స్పందించడం కాకుండా పారిశ్రామిక ప్రాంతాల నుంచి చెరువుల వరకు మొత్తం నీటి ప్రవాహమార్గాన్ని మ్యాప్ చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే నీరు, డ్రైనేజీలు, వర్షపునీటి ప్రవాహమార్గాలు, చెరువుల్లోకి చేరే కాలువలపై ప్రత్యేక నిఘా పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**నమూనాలు సేకరించి.. నిజాలు తేల్చాలి...**

గుమ్మడిదల పారిశ్రామికవాడతో పాటు పరిసర గ్రామాల్లోని చెరువులు, కాలువలు, భూగర్భజలాల నుంచి నీటి నమూనాలను అధికారులు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. పరీక్షల ఫలితాలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతోపాటు కాలుష్యానికి కారణమైన మూలాన్ని శాస్త్రీయంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు స్పష్టంచేస్తున్నారు. పారిశ్రామికాభివృద్ధి అవసరమే అయినా.. దాని మూల్యం ప్రజల ఆరోగ్యం, పంటలు, పశువులు, భూగర్భజలాలు, చెరువులు చెల్లించాల్సిన పరిస్థితిరాకూడదని స్థానికులు అంటున్నారు.



వర్షపు నీటితో పాటు బయటకు వస్తున్న కాలుష్య వ్యర్థ జలాలు (ఫైల్ ఫోటో)

**కాలుష్య గొలుసుకు కళ్లెం ఎప్పుడు?**

ఒక చెరువు కలుషితమైతే అది అక్కడితో ఆగకపోవచ్చు. నీటి ప్రవాహంతో ఒక జలవనరు నుంచి మరొక జలవనరుకు కాలుష్యం చేరే అవకాశం ఉన్నందున గుమ్మడిదల నుంచి జిన్నారం వరకు జల వనరులను ఒక సమగ్ర వ్యవస్థగా పరిగణించి పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. కాలుష్యంపై కేవలం అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించడం కాకుండా, నిరంతరనిఘా వ్యవస్థను ఏర్పాటుచేసి పరిశ్రమల కార్యకలాపాలను పర్యవేక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువులు కాలుష్య గొలుసులో చిక్కుకోకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## ఎల్‌నినో విపత్తుకు నీటిదోపిడీ తోడైతే..?

**-వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటి తరలింపు?**
**-భూగర్భజలాలపై పెరుగుతున్న ఆందోళన**
**-అధికారుల సమగ్ర విచారణకు డిమాండ్..!**

**సంగారెడ్డి, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

ఒకవైపు ఎల్‌నినోప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదంపై ఆందోళనలు.. మరోవైపు నీటి వనరుల వినియోగంపై ప్రశ్నలు..! వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం తగ్గితే భూగర్భజలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండగా, వ్యవసాయ బోర్ల నుంచి నీటిని ట్యాంకర్లద్వారా సేకరించి పరిశ్రమలకు తరలిస్తున్నారనే ఆరోపణలు గుమ్మడిదల పరిసర ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈ రెండు అంశాలు కలిస్తే భవిష్యత్తులో గ్రామాల నీటి భద్రతకు సవాలుగా మారవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**ఎల్‌నినో ప్రభావంతో నీటివనరులపై అదనపుభారం?**

ఎల్‌నినోపరిస్థితులు భారతదేశంలో రుతుపవనాలపై ప్రభావంచూపే అవకాశం ఉన్నప్పటికీ, దాని ప్రభావం ప్రతి ప్రాంతంలో ఒకేలా ఉండదు. వర్షపాతంతగ్గడం, భూగర్భ జలాల పునరుద్ధరణ మందగించడం వంటి పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయం, తాగునీటిసరఫరాపై ఒత్తిడిపెరిగే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించడం మరింత కీలకం.

**వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీరు?**

గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం తదితర ప్రాంతాల్లో వ్యవసాయబోర్ల నుంచి నీటిని సేకరించి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉన్నప్పటికీ, నీటి సేకరణ వనరులు, సరఫరా పరిమాణం, వినియోగ ఉద్దేశ్యం, సంబంధిత అనుమతులపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. రైతులకు వ్యవసాయ అవసరాల కోసం అందిస్తున్న ఉచిత విద్యుత్తును ఉపయోగించి నీటిని తోడి వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్నారా? అన్న అంశాన్ని కూడా విద్యుత్తుశాఖ అధికారులు పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధమైన వినియోగం నిర్ధారణ అయితే వర్తించే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

**గ్రామాలకు నీటి కష్టాలు వచ్చే ప్రమాదం..!**

వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే భూగర్భజలాల పునరుద్ధరణపై ప్రభావంపడే అవకాశం ఉంటుంది. అదే సమయంలో బోర్ల నుంచి నీటి వినియోగం అధికంగా కొనసాగితే స్థానిక జలవనరులపై మరింత ఒత్తిడి ఏర్పడవచ్చు. అయితే గుమ్మడిదల ప్రాంతంలో ప్రస్తుతం భూగర్భజలాల పరిస్థితి ఎలా ఉంది? ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపు ఎంత మేరకు జరుగుతోంది? గ్రామాల నీటిలభ్యతపై దానిప్రభావం ఎంత? అనే అంశాలు క్షేత్రస్థాయి పరిశీలనతోనే తేలాల్సి ఉంది.



ఓ పరిశ్రమ ముందు నీటి టాంకర్ల క్యూలైన్ దృశ్యం

**సంబంధిత శాఖలు ఏం చేయాలి?**

విద్యుత్తుశాఖ, భూగర్భజలాలశాఖ, రెవెన్యూశాఖ, మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి తమ పరిధిలోకి వచ్చిన సమస్యల పరిష్కారం దిశగా చేపట్టాల్సిన చర్యల గురించి పరిశీలించాలి.

**ముందస్తు చర్యలే పరిష్కారం..!**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతుందని ముందుగానే నిర్ధారించలేం. అయినప్పటికీ నీటి కొరతను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు అవసరం. గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం ప్రాంతాల్లో నీటివనరుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. వ్యవసాయబోర్ల నుంచి పరిశ్రమలకు నీటిసరఫరా జరుగుతున్నట్లు తేలితే, ఇప్పటినుంచే అధికారులు అప్రమత్తం కావాలి. నీటివనరుల పరిరక్షణకు పర్యవేక్షణ చేపట్టి, ప్రజల నీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

## ఓఆర్ఆర్ పైన రోడ్డు ప్రమాదం

**-జిహెచ్ఎంసి కార్మికుడు, ట్రాలీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి**

**సంగారెడ్డి, అక్టోబరు 25, ప్రభాతవార్త:**



దెబ్బతిన్న మినీ ట్రాలీ దృశ్యం

ఆగి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను అతి వేగంగా వచ్చిన మినీట్రాలీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. ఆదివారం ముత్తంగి ఓఆర్ ఆర్ ఎగ్జిట్ వద్ద డివైడర్ల మొక్కలకు జిహెచ్ఎంసికిచెందిన వాటర్ ట్యాంకర్ సిబ్బంది నీరు పోస్తున్నారు. అదే సమయంలో హైదరాబాదు నుండి ముత్తంగి వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ ఆటోట్రాలీ వేగంగావచ్చి కార్మికుడు శ్రీనివాస్ (30)తో పాటు వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో కార్మికుడితో పాటు ట్రాలీ నడుపుతున్న డ్రైవర్ శ్రీనాథ్ (26) క్యాబిన్లో ఇరుక్కుని తీవ్ర గాయాలతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మనూర్‌ను వెంటాడుతున్న విషాదం

**-పక్షం రోజుల్లో 5 మంది మృతి-4గురికి గాయాలు**

**సంగారెడి, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

పక్షంరోజుల వ్యవధిలో మండలకేంద్రమైన మనూర్ గ్రామానికిచెందిన రెండు కుటుంబాలకు చెందిన 5గురు వేరువేరు ప్రమాదాల్లో మృతిచెందగా మరో 4గురు తీవ్రగాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... సెప్టెంబరు 9న మనూర్ గ్రామానికి చెందిన ఒకేకుటుంబానికి చెందిన మాటూరి నరసింహారెడ్డి, కృష్ణవేణి, సంగారెడ్డిలు గ్రామ శివారులోని కుంటలో బట్టలు ఉతికేందుకువెళ్లి మృత్యువాతపడిన విషయం పాఠకులకు విదితమే. ఈ నెల 16న సాయంత్రం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంగమణి, ఆమె భర్త, రేషన్‌డీలర్ సంజీవులు, ఇద్దరుకుమారులు, కోడలు మమత, మనవడు విక్రమ్‌లతో కలిసి మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో కొలువున్న తుల్జాభవాని మాతను దర్శించుకునేందుకు వెళుతూ కర్ణాటకలోని బసవ కళ్యాణ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగమణి, సంజీవులు అక్కడికి అక్కడే మృతి చెందగ కోడలు మమత, మనవడు విక్రమ్ గాయాలకుగురై ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న విషయం పాఠకులకు విదితమే. పక్షంరోజుల్లో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకోవడంతో విధి గ్రామంపై చిన్నచూపు చూస్తోందని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు.

## వనదుర్గమ్మకు జన హారతి...

-భక్తజన సందోహంతో కిటకిటలాడిన ఏడుపాయల క్షేత్రం



రాజగోపురం వద్ద భక్తుల దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

ఎటుచూసిన జనమే జనం.. అందరిలో భక్తిభావం.. ఆధ్యాత్మిక వాతావరణం.. ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన పాపన్నపేటమండలం ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం ఆదివారం వారాంతపు సెలవురోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో జనసంద్రమైంది. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధప్రాంతాలతో పాటు పొరుగుజిల్లాలు, జంటనగరాల నుంచి భక్తులు అధికసంఖ్యలో అమ్మదర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యామ్, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీపాయలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులుచెల్లించుకున్నారు. భక్తుల జయజయధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లుచేశారు.

## శక్తిపీఠంలో ఘనంగా అష్టోత్తరశత మహాయజ్ఞం..

-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎంపి బీబీ పాటిల్ దంపతులు



పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**శివంపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన శివంపేటలో కొలువుదీరిన బగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అష్టోత్తరశత(108) కుండాత్మక మహాయజ్ఞం కనులపండువగా జరిగింది. ఉదయం 8గంటల నుంచే మంత్రోచ్చారణలు, వేదఘోషలతో శక్తిపీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శక్తిపీఠం ప్రాంగణంలో 200 జంటలు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయప్రాంగణం కిటకిటలాడింది. మహాయజ్ఞం కార్యక్రమ ఏర్పాట్లను మాజీ జడ్పీటీసీ, శక్తిపీఠం ట్రస్టు సభ్యులు పబ్బమహేశ్ గుప్తా పర్యవేక్షించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మహాయజ్ఞం సందర్భంగా మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాదాపు 3000 మంది భక్తులకు పబ్బరమేశుప్తా, పబ్బమహేశ్‌గుప్తా, సుదర్శన్‌గౌడ్, వెంకట్రెడ్డిలు సొంతఖర్చులతో అన్నదానంచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పబ్బ రమేశుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశుప్త, మాజీ ఎంపీపీ హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్, నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సీఐ వెంకటరాజాగౌడ్ దంపతులు, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ మల్లేష్, 100 మంది వేదపండితులు, రుత్వికులు, భక్తులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం ఓంప్రకాష్

## రక్తదాతను సన్మానించిన మునిగాల మణిక్ ప్రభు



ఓం ప్రకాష్‌ను సన్మానిస్తున్న మునిగాల మాణిక్ ప్రభు

**సంగారెడ్డి, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

సామాజిక సేవకు ప్రతిరూపంగా నిలుస్తూ, ఉత్తమ రక్తదాతగా సేవలందిస్తున్న గౌరవ డాక్టరేట్ గ్రహీత డి.ఓంప్రకాష్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగాల మణిక్ ప్రభు అభినందించి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మునిగాల మణిక్ ప్రభు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 53సార్లు రక్తదానం చేసి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందికి రక్తాన్ని అందించి ప్రాణదాతగా నిలిచిన ఓంప్రకాష్ సేవలు అభినందనీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లి కూడా రక్తం అవసరమైనవారికి రక్తదానంచేస్తూ తన ఔదార్యాన్ని చాటుకున్నారని కొనియాడారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ఓంప్రకాష్ చేస్తున్న సేవలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఓంప్రకాష్ వంటి సేవాభావం కలిగిన వ్యక్తులను సమాజం గుర్తించి ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ వేంకటేశం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, ఉపాధ్యక్షులు దత్తాగౌడ్, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.ఖైసర్, జర్నలిస్టులు ఓంప్రకాష్, భూమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన వంటేరు

**గజ్వేల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

గజ్వేల్ మండలం సింగాటం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కుంట రాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందగా, ఆ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధితకుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢసంతాపం తెలిపారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అదేగ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కప్ప స్వామి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాంపల్లి కరుణాకర్ నానమ్మ నాంపల్లి రాజవ్వ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు దాసరి పెంటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు, తాటికొండ మధుసూదన్‌రెడ్డి, ములుగు మల్లేశం, ఉపసర్పంచ్ ఆందోలు నర్సింలు, వార్డుసభ్యులు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## మానవత్వం చాటుకున్న గౌరారం ఎస్ఐ

**వర్గల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వేలూరు గ్రామానికి చెందిన ఘనపురం దివ్య అనే బాలిక తండ్రినికోల్పోగా, తల్లి కూలీపనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బాలికచదువుకు ఆటంకం ఎదురవడంతో విషయం తెలుసుకున్న గౌరారం ఎస్ఐ జె.ఆరోగ్యం మానవతా దృక్పథంతో స్పందించి బాలికకు మెరుగైనవిద్య అందించేందుకు మహాత్మాగాంధీ జ్యోతి రావుపూలే తెలంగాణ బిసిసంక్షేమ గురుకుల విద్యాలయంలో ప్రవేశం, వసతి కల్పించేందుకు చొరవతీసుకున్నారు. అలాగే బాలికకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, షూస్ అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ పోలీసులు సమాజసేవలో కూడా ముందుండాలనే సందేశాన్ని ఎస్ఐ ఆరోగ్యం చాటిచెప్పారని అన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక అలయ్ బలయ్

-ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి




అలయ్ బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

**గజ్వేల్, అక్టోబరు 25 (ప్రభాతవార్త):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలందరినీ ఐక్యంగా నిలబెట్టే గొప్ప వారధులని, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి జీవించడమే తెలంగాణ సమాజ గొప్పతనమని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని లక్ష్మణ్ గార్డెన్‌లో పొన్నాల కుమార్, నీరుడి స్వామి, కొడకండ్ల నర్సింలు, బాకి స్వామి, కన్నాయాదవ్, మహేష్‌ల ఆధ్వర్యంలో దసరా ఆత్మీయసమ్మేళనం సందర్భంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ అలయ్ బలయ్ వంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతకు, సమానత్వానికి, పరస్పర గౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. సమాజంలో కుల, మత, వర్గ భేదం లేకుండా అందరిని కలుపుకొని ఏకతాటిగా అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఒకరికొకరు జమ్మి పెట్టుకొని ఆలింగనం చేసుకున్నారు. అలయ్ బలయ్ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యఅతిథులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించి మొమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్ పట్టణ పుర ప్రముఖులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు, టిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, కొనమైన కన్నాయాదవ్, విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకట్‌చారి, డాకని బిక్షపతి పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణాదానంతో సమానం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

రక్తదానం ప్రాణాదానంతో సమానమని వాసవీక్లబ్ పూర్వ అధ్యక్షులు పుల్లూరి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న కొమురవెల్లిమండలం ఐనాపూర్‌గ్రామానికి చెందిన నీలా తిరుమల్‌కు సిద్దిపేట పట్టణానికి చెందిన దాత రాము రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంచేయడం వలన అరోగ్యానికి ఎలాంటి హాని జరగదని ఆరోగ్యంగా ఉన్న యువతీయువకులు రక్తదానం చేయొచ్చన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానంచేయడానికి యువత ముందుకురావాలన్నారు. పిలువగానే బ్లడ్‌బ్యాంకుకు వచ్చి రక్తదానంచేసిన చింత రామును ఆయన అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి ఆంజనేయులు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవననిర్మాణ కార్మికుల సంక్షేమాన్నిపట్టించుకోని ప్రభుత్వాలు

**చిన్నకోడూరు, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

భవననిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భవననిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చెరుకు నారాయణ అన్నారు. మండల పరిధిలోని అనంతసాగర్, గోనెపల్లి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన భవననిర్మాణ కార్మికులు సల్లోజు రాములు, మేడి నర్సయ్యల కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. ఎండనక, వాననక రెక్కలుముక్కలు చేసుకుంటున్న భవననిర్మాణ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో కార్మికుల ఓట్లుదండుకోవడం తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. ప్రతి కార్మికుడికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కొత్త కార్మికులకు లేబర్‌కార్డు అందజేయలన్నారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు జేరిపోతుల శంకరయ్య, మహంకాళి ఎల్లం, జేరిపోతుల రమేష్, మందపల్లి లింగం, బోనాల లింగం, చెప్యాల రాజు, భక్తుల రమేష్, మెట్ల వేణు, రాజయ్య, నరేష్, గంగాధర రాజు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు యువతరం యూత్ చేయూత

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పిల్లలకు పల్లెపహాడ్ యువతరం యూత్‌నాయకులు అండగానిలిచారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్‌కు చెందిన గూడూరి అనసూయ(40) అనారోగ్యంతో మృతిచెందడంతో యువతరం యూత్‌నాయకులు ఆదివారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యంతోపాటు నిత్యావసరసరుకులను అందజేశారు. ఈసందర్భంగా యువతరం యూత్ అధ్యక్షుడు కొమ్ము నరేష్‌యాదవ్ మాట్లాడుతూ అనసూయ మృతి ఆ కుటుంబానికి తీరనిలోటని అన్నారు. ఆమె భర్త గూడూరి శ్రీనివాస్ సుమారు 15 ఏళ్ల క్రితమే మృతిచెందగా, వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారని తెలిపారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టులో భూమి, ఇల్లు కోల్పోయిన ఆ కుటుంబానికి ప్రభుత్వం రెండు పడకగదుల ఇల్లు కేటాయించిందని, ఆర్థిక ఇబ్బందులతో పాటు కుమారుడి అనారోగ్యానికి చికిత్స ఖర్చుల కోసం ఇంటిస్థలంలో కొంతభాగాన్ని విక్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తల్లి కూడా మృతిచెందడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడి చికిత్సకు ఆర్థికసహాయం అవసరమని తెలిపారు. దాతలు మానవతాదృక్పథంతో ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యువతరం యూత్ గౌరవ అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి నాగరాజు, క్యాషియర్ శ్రీకాంత్, జాయింట్‌సెక్రటరీ ప్రశాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహిపాల్, ప్రవీణ్, బాబు, శేఖర్, దుర్గాప్రసాద్, నర్సింలు, శేఖర్, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, వేణు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

-మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

**సంగారెడ్డి జిల్లా, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

ఈ నెల 23వ తారీఖు కర్ణాటకలోని బసవ కళ్యాణ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల కేంద్రమైన మనూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు మాజీ సర్పంచ్ సంగమణి, రేషన్ డీలర్ సంజీవులు కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదివారం వారి నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని రద్దు చేసిందని, అందుకు మృతిచెందిన ఇద్దరికి 5 లక్షల రూపాయల చొప్పున 10 లక్షల రూపాయలను అందచేసి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. రైతుబీమా రద్దుతో మృతిచెందిన వారి కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి తనయుడు నాగేందర్‌రావు, మాజీ ఎంపిటిసి సభ్యులు ముజేమిల్, బిఆర్ఎస్ పట్టణాధ్యక్షులు నగేష్‌సేట్, మల్లేష్, మానాన్, నర్సింలు, సయ్యద్ సమద్, నారాయణలు ఉన్నారు.

## బాలాజీనగర్‌లో భూగర్భ గ్యాస్ పైప్‌లైన్ లీకేజ్ భయాందోళనలో ప్రజలు

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబరు 25, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పరిధిలోని బాలాజీనగర్‌లో ప్రమాదవశాత్తు భూగర్భ గ్యాస్ పైప్ లైన్ పగిలిపోవడంతో తీవ్ర గ్యాస్ లీకేజీ ఏర్పడింది. ఈ ఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బాలాజీనగర్ వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా జేసీబీతో తవ్వకాలు జరుపుతుండగా, కింద ఉన్న గ్యాస్ పైప్ లైన్‌కు అనుకోకుండా నష్టం వాటిల్లింది. దీంతో పైప్‌లైన్ తీవ్రంగా దెబ్బతిని గ్యాస్ వేగంగా బయటకు విడుదలవ్వడం ప్రారంభమైంది. ఒక్కసారిగా గ్యాస్ వాసన దట్టంగా వ్యాపించడంతో సమీప నివాసితులు, వ్యాపారులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గ్యాస్ లీకేజీ విషయాన్ని గమనించిన వెంటనే స్థానికులు గ్యాస్ పంపిణీ సంస్థ (భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్) అధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సాంకేతిక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, ముందు జాగ్రత్తగా సంబంధిత లైన్‌తో గ్యాస్ సరఫరాను నిలిపివేశాయి. పగిలిన పైప్లను అత్యవసర మరమ్మతులు చేపట్టి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు వేగవంతం చేశారు. సమయానికి అధికారులు స్పందించి గ్యాస్ సరఫరా నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## సూరారంలో చిన్న గ్యాస్ సిలిండర్ పేలుడు వృద్ధుడికి గాయాలు

**జీడిమెట్ల, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో ఆదివారం మధ్యాహ్నం వంట చేస్తుండగా చిన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో 60 ఏళ్ల వ్యక్తి గాయపడ్డాడు. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో డయల్ 100కు సమాచారం అందడంతో సూరారం పోలీసులతోపాటు 108 అంబులెన్స్‌సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన దార్ బహదూర్(60) కొన్ని సంవత్సరాలుగా కుటుంబంతో కలిసి భగత్‌సింగ్‌నగర్‌లో నివసిస్తూ పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రితం ఆయన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులంతా నేపాల్‌కు వెళ్లారు. ఆదివారం దార్ బహదూర్ తన కుమారుడు కృష్ణతో కలిసి తిరిగి సూరారం ప్రాంతానికి వచ్చాడు. దార్ బహదూర్ భగత్ సింగ్ నగర్‌లోని తన గదిలో నివసిస్తుండగా, కుమారుడు కృష్ణ దులపల్లి ప్రాంతంలోని కంపెనీ గదిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో దార్ బహదూర్ తన గదిలో వంట చేస్తుండగా చిన్న గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఆయన గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది వెంటనే స్పందించి బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి సూరారం పోలీసులు వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

# జనావాసాల మధ్య ఐరన్ కంపెనీ..

-కార్మికుడి మృతితోనైనా కనువిప్పు కలగాలి

-పిసిబి కార్మికశాఖ అధికారులు స్పందించాలి

మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్



సంఘటన జరిగిన స్థలం దృశ్యం

**సంగారెడ్డి, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

బొంతపల్లి పారిశ్రామికవాడ పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన యాజమాన్యాలు, సంబంధితశాఖల అధికారుల పర్యవేక్షణపై మరో సారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బొంతపల్లి పారిశ్రామికవాడలోని ఒక ఐరన్ కంపెనీలో రెండు రోజులక్రితం జరిగిన ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతిచెందడం కలకలం రేపింది. జనావాసాల మధ్య కొనసాగుతున్న పరిశ్రమలో కార్మికుడి ప్రాణంపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మృతుడు బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపారన్ జిల్లాలోని నౌరంగియా గ్రామానికి చెందిన జిత్నారాయణ్ ముసాహర్(47), తండ్రి శివపూజన్‌గా గుర్తించారు. ఉపాధి కోసం స్వరాష్ట్రాన్ని విడిచి వచ్చి పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం విషాదకరం.

**జనావాసాల మధ్య పరిశ్రమ ఎందుకు..?**

సదరు ఐరన్ కంపెనీ జనావాసాల మధ్య కొనసాగడంపై పలువురు మున్సిపల్‌కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రజల నివాసప్రాంతాల్లో పరిశ్రమ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, భద్రతాప్రమాణాలు, పర్యావరణనిబంధనలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. జనావాసాల మధ్య ఉన్న ఈ పరిశ్రమను అక్కడి నుంచి తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధి పేరుతో కార్యకలాపాలు కొనసాగుతుండగా, మరోవైపు కార్మికుల భద్రత, స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు తగిన ప్రాధాన్యత లభిస్తోందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే తనిఖీలు నిర్వహించి ఇలాంటి ఘటనలను నివారించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**అధికారులు ఏం చేస్తున్నారు?**

సదరు ఐరన్ కంపెనీతో పాటు బొంతపల్లి పారిశ్రామికవాడలోని ఇతర పరిశ్రమల్లోనూ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు చేపట్టాలని డిమాండ్ వినిపిస్తోంది. కార్మికశాఖ అధికారులు భద్రతాప్రమాణాలు, కార్మికుల పని పరిస్థితులు, చట్టబద్ధమైన ప్రయోజనాల కల్పనపై విచారణ జరపాలని డిమాండ్‌చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పరిశ్రమ అనుమతులపై కూడా నిబంధనల మేరకు చర్యలు పరిశీలించాలని కోరుతున్నారు. పరిశ్రమను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ కార్మికుడి మృతి ఘటనపై గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ ఐరన్ కంపెనీని సందర్శించి ప్రమాదానికిసంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులభద్రత, ఈఎస్ఐ, పిఎఫ్ సదుపాయాలు, పరిశ్రమలనిర్వహణ తీరుపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు. పొల్యూషన్ కంట్రోల్ అధికారులు పరిశ్రమను సందర్శించి నిబంధనల అమలును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సిఐటియు నేతల డిమాండ్

**ధర్నాచౌక్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటియూ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియూ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. సిఐటియూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ధర్నాను ప్రారంభించి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పగిస్తోందని ఆరోపించారు. పెట్టుబడిదారుల లాభాలను మరింత పెంచటానికే నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి, కార్మికులకు పనిగంటలు పెంచుతున్నారని ధ్వజ మెత్తారు. కనీసవేతనాల సలహా మండలిలో సీఐటియూ, ఏఐటియూసీ, ఐఎఫ్‌టియూసీ వంటి యూనియన్లకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవటం దుర్మార్గ మని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మార్చు కోకపోతే ప్రభుత్వాన్నే మార్చే దిశగా కార్మికవర్గం ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్తుందని హెచ్చరించారు. సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ రెండూ కార్మికుల పట్ల నిర్లక్ష్య, నియంతృత్వ విధానాలను అమలుచేస్తున్నాయని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేర్లతో శ్రమదోపిడీని పెంచుతున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా మల్లిపుల్ దేస్ ధర్నాకు సిఐటియూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని స్పష్టం చేశారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధానకార్యదర్శి, టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శి బి.వెంకట్, సిఐటియూ ఉపాధ్యక్షులు ఆర్.సుధాభాస్కర్, భూపాల్, రాష్ట్ర కార్యదర్శి ఎం.పద్మశ్రీ, ఎస్ రమ, జే.వెంకటేష్‌లు హాజరై మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీసవేతనాలు 42వేలు అమలుచేయాలని, సామాజిక భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగసంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటియూ నేతలు, ఆఫీస్‌బేరర్స్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## సింగూరు-మంజీరా నీటి సరఫరా ప్రాంతాలకు గోదావరి జలాల మళ్లింపునకు..వేగంగా పైప్‌లైన్ల పనులు

**హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** రానున్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జలమండలి ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది. జల మండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లను చేపట్టింది. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఆయా జలాలపై ఆధారపడిన ప్రాంతాలకు గోదావరి జలాలను మళ్లించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని వెలిమెల గ్రామం వద్ద 3000 మి.మీ. వ్యాసం గల గోదావరి రింగ్ మెయిన్‌ను, 1200 మి.మీ. వ్యాసంగల మంజీరా ఫేజ్-3, ఫేజ్-4 గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్లతో అనుసం ధానించే పనులు చేపట్టింది. ఈ పనుల పురోగతిని జలమండలి టెక్నికల్ డైరెక్టర్ ప్రభు, సీజీఎం రాజశేఖర్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తిచేసి, గోదావరి జలాలను సింగూరు-మంజీరా సరఫరా వ్యవస్థలోకి మళ్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అనుసంధానపనులు పూర్తయితే సింగూరు-మంజీరా సరఫరా ప్రాంతాలకు గోదావరి జలాలను అందించేందుకు వీలవుతుందని, తద్వారా నీటి ఎద్దడి పరిస్థితుల్లోనూ తాగునీటి సరఫరాలో అంతరాయాలను నివారించవచ్చని అధికారులు తెలిపారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

**నేరేడ్‌మెట్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** గోకుల్‌నగర్, కాకతీయనగర్ డివిజన్‌లో పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదు కార్యక్రమం బతకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి సందిల రమేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు జగదీష్ చారి, లింగారావు, ప్రశాంత్, పరమేష్, అనిల్‌గౌడ్, ధనరాజ్‌గౌడ్, సుశాంత్, నరేందర్, శివ రెడ్డితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా యెల్లు హేమంత్‌రెడ్డి

**రామంతాపూర్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** భారతీయ జనతా యువ మోర్చా మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా యెల్లు హేమంత్ రెడ్డి నియమితులైయ్యారు. ఈ మేరకు ఆదివారం రామంతాపూర్‌లో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్‌గుప్తా తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా వారు హేమంత్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, యువత సమస్యల పరిష్కారానికి, సమాజ సేవకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనను అభినందించిన నాయకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు బొడ్డుపల్లి శ్రీనివాస్, ధర్మ రాజినికర్‌రెడ్డి, యెల్లు శశిధర్‌రెడ్డి, కొడిచింతల ఉదయ్‌కుమార్, కట్ట విఘ్నేష్‌రెడ్డి, ఉకంటి జయప్రకాశ్ రెడ్డి, కావలి బాలాజీ, రవీష్, శ్రీకాంత్, ప్రేమ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి : ఎమ్మెల్యే

**ఉప్పల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా పేర్లను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఆదివారం ఉప్పల్ భాగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్ పరిధిలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలభైరవ స్వామి టెంపుల్ రోడ్డులోని గెలాక్సీ కాల్టన్ హిల్ అపార్ట్‌మెంట్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నివాసితులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు జాబితాలో పేరును నమోదుచేసుకుని, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.. కార్యక్రమంలో ఉప్పల్ భాగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మధుసూదన్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నేతలు పూడూరి జితేందర్‌రెడ్డి, అన్య బాలకృష్ణ, జెట్ట కిషోర్, చింతల నరసింహారెడ్డి, గడ్డం పాపిరెడ్డి, సుక్క కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, రాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో కానిస్టేబుల్‌ను కొరికిన ర్యాపిడో డ్రైవర్

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** నగరంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. ఓ ర్యాపిడో డ్రైవర్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చేతిని కొరికి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన చంద్రాయణగుట్ట సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు రోడ్డు పక్కన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వమిస్తుండగా అదేదారిలో ర్యాపిడో డ్రైవర్ అజీజ్ వచ్చాడు. అతడిని పరీక్షించగా మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు తేలింది. దీంతో పోలీసులు అతడి వాహనాన్ని స్వాధీనం చేసుకోగా, వారినుంచి వాహనం విడిపించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఎంత ప్రయత్నించినా వాహనం చేతికి రాకపోవడంతో చివరికి కానిస్టేబుల్‌ను కొరికి హంగామా సృష్టించాడు. పోలీసులు అజీజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒక చోరీ చేశాడు.. మరో చోరీయత్నంలో చిక్కాడు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 25,ప్రభాతవార్త:** ఒకచోట సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు.. అదే ఊపులో మరో ప్రాంతంలోనూ చోరీ చేసేం దుకు ప్రయత్నం చేశాడు. ఇంటి యజమా నులు కాస్త గమనించి 112కు ఫోన్ చేయ డంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పారి పోయిన దొంగను క్షణాల్లో పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీ నం చేసు కున్నారు. బంజారాహిల్స్ డిఐ కవియుద్దీన్ కథనం ప్రకారం.. బంజారా హిల్స్‌లోని ముగ్ధా భవనంలోని సెల్లార్ లో కాపలదారుగా పనిచేసే గోపాల్ డెకా సెల్‌ఫోన్‌ను బోజగుట్ట ప్రాంతానికి చెందిన గువ్వ శ్రీను(31) చోరి చేశాడు. అక్కడి నుంచి రోడ్ నంబరు 12 లోని ఎన్బీటీనగర్‌లో ఉన్న మరో భవనంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు గుర్తించి 112 సమాచారం అందించారు. దీంతో బంజారాహిల్స్ పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్నారు. నిందితుడి గురించి ఆరాతీసి చుట్టుపక్కల విచారించారు. అదే సమయంలో అక్కడ అనుమానస్పదంగా తారసపడిన గువ్వా శ్రీనును అదుపులోకి తీసుకొని విచారించారు. అతనినుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి కేసు దర్యాప్తుచేస్తున్నట్లు డిఐ తెలిపారు.

